
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
3
శనివారం 13 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.10 (120.2518)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.43 (2.66)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.58 (0.66)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.138 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించతలపెట్టిన రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టమవుతోంది. భారతీమాల పరియోజన పథకం కింద ఈ రింగ్‌రోడ్డును నిర్మిస్తున్నట్లు స్పష్టంచేసింది. ఆర్ఆర్ఆర్‌ను భువనగిరి మండలం రాయిగిరి నుంచి కాకుండా అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్‌చేస్తూ గత కొన్నాళ్లుగా రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు భూసేకరణ నిలిపివేస్తూ స్టేఆర్డర్‌ను మంజూరు చేసింది.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



ఆర్ఆర్ఆర్‌పై ముందుకే

- రాయిగిరి వద్ద అలైన్‌మెంట్ మార్పు లేనట్టే?
- కోర్టుస్టేను నిలిపివేయాలని కౌంటర్ దాఖలు చేసిన ప్రభుత్వం
- పరిహారం పెంపుపై ప్రభుత్వం సమాలోచన
- న్యాయపోరాటానికి సిద్ధమవుతోన్న రైతులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఆలైన్‌మెంట్‌ను మార్చాలని, భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలోనే ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతులకు మద్దతు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే సైతం ప్రభుత్వంతో చర్చించి అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై ప్రభుత్వం వేగవంతం చేస్తుండటంతో పాటు రైతులకు సంబంధించిన భూములపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరుతూ జిల్లా యంత్రాంగం ఉన్నత న్యాయస్థానానికి కౌంటర్ దాఖలుచేసింది. మరోవైపు రాయిగిరి రెవెన్యూ గ్రామం నుంచి ఇప్పటికే ఆర్ఆర్ఆర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఈ రోడ్డుకు దక్షిణ, ఉత్తర విభాగాలకు కలిసి ఒకే నెంబరు ఇవ్వాలని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించగా, కేంద్రం సానుకూలంగా స్పందించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే రాయిగిరి నుంచే పక్కాగా ఆర్ఆర్ఆర్ నిర్మాణం జరుగుతుందని స్పష్టమవుతోంది. రైతులతో చర్చించి మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి సీఎం సూచించారు. అయితే రాయిగిరి రైతులు తమ భూములను కాపాడుకునేందుకు న్యాయపోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం వర్సెస్ రైతులు ఢీఅంటే ఢీ అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. రైతులకు పరిహారం పెంచి ఒప్పిస్తారా? న్యాయ పోరాటానికి మొగ్గుచూపుతారా? అన్నది వేచి చూడాల్సిందే.

ఇప్పటికే వేర్వేరు ప్రాజెక్టుల్లో 145 ఎకరాలు

ప్రభుత్వం చేపట్టిన పలు ప్రాజెక్టులతో రాయిగిరిలో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వేర్వేరు ప్రాజెక్టుల్లో 145 ఎకరాల వరకు రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జాతీయ రహదారి-163కోసం 100 ఎకరాలు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 45 ఎకరాలు, విద్యుత్ హైటెన్షన్ లేన్ల, టవర్ల ఏర్పాటుతో విలువైన భూములు కోల్పోయామని, ప్రస్తుతం ఆర్ఆర్ఆర్‌తో మరో 300 ఎకరాల వరకు నష్టపోతున్నామని చెబుతున్నారు. తాము ఇంకా భూము లు కోల్పోయేందుకు సిద్ధంగా లేమని, న్యాయపోరాటం చేస్తామ ని రైతులు స్పష్టంచేస్తున్నారు. ప్రభుత్వం గతంలో రూపొందించిన ప్రతిపాదన మేరకు యాదగిరిగుట్ట మండలం వంగపల్లి మీదుగా జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని ఉండగా.. అలైన్‌మెంట్‌ను మార్పులుచేసి తమకు అన్యాయం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర భాగం నిర్మాణంలో మొత్తం 1852.44ఎకరాలు

ఉత్తరభాగం నిర్మాణంలో భాగంగా జిల్లాలో 1852.44ఎకరాల మేర భూసేకరణ చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు రైతుల పొలాల్లో సర్వే నిర్వహించి... హద్దురాళ్లను సైతం నాటారు. ఏప రైతు ఎంతమేరకు భూములు కోల్పోతున్నారన్న అంశంపై కేంద్రం ఇప్పటికే 3డీ నోటిఫికేషన్ జారీచేసింది. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం మొత్తం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన 113 గ్రామాల మీదుగా వెళుతోంది. జిల్లాలో 34 గ్రామాల మీదుగా ఆర్ఆర్ఆర్‌ను నిర్మించనున్నారు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ ఏర్పాటుపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు పరిశీలిస్తున్నారు. చౌటుప్పల్ వద్దనా లేకపోతే తంగడ్‌పల్లి గ్రామమా అన్నది స్పష్టం కానుంది. ఇటీవల ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలోనూ ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై వేగం పెంచాలని, అలైన్‌మెంట్ మార్పుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని కలెక్టర్ హనుమంతు కే.జెండగే 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

వన మహోత్సవంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



కలెక్టరేట్‌లో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జూలై 12: వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యంచేయాలని, వివిధ శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షించి మాట్లాడారు. జిల్లాకు నిర్దేశించిన 17.44 లక్షల మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అవెన్యూ కమ్యూనిటీ ప్లాంటేషన్ సంబంధించి గుంతలు తీసే కార్యక్రమాన్ని పూర్తిచేసి మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణ చాలా ముఖ్యమని, అందుకోసం గ్రామాలు, మునిసిపాలిటీల వారీగా యాక్షన్ ప్లాన్‌తో ప్రతీ మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, శిఖం భూముల్లో మొక్కలు నాటి భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, పరిశ్రమల యాజమానుల సహకారంతో పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలన్నారు. మునిసిపాలిటీల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని, పది శాతం గ్రీన్ బడ్జెట్ వినియోగించి మొక్కలను సంరక్షించాలన్నారు. ప్రజాప్రతినిధులను వన మహోత్సవంలో భాగస్వాములను చేసే లక్ష్యాలను సాధించాలని, పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలన్నారు. సమీక్షలో జడ్పీ సీఈవో శోభారాణి, అటవీ శాఖ అధికారి పద్మజారాణి, డీఆర్డీవో ఎం.ఏ కృష్ణన్, పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, డీపీవో ఆర్.సునంద, ఎక్సైజ్ అధికారి సైదులు, వ్యవసాయ అధికారి అనురాధ, ఉద్యాన శాఖ అధికారి అన్నపూర్ణ, భువనగిరి మునిసిపల్ కమిషనర్ రామాంజులురెడ్డి, నీటి పారుదల శాఖ అధికారి నర్సింహ, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రియల్టర్లకు రైతుబంధు దడ

- ప్లాట్లుగా మార్చినా రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే..
- ఏళ్ల తరబడి రైతుబంధు సొమ్ము కాజేస్తున్న వైనం
- ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్న అధికారులు



చౌటుప్పల్‌లో రైతుబంధు పొందుతున్న వెంచర్లు

వ్యవసాయ పెట్టుబడి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుబంధు' పథకం రియల్టర్లకు వరంలా మారింది. ఎప్పుడో ఏళ్ల క్రితం వ్యవసాయ భూము లు కొనుగోలు చేసి, వాటిని వెంచర్లుగా మార్చారు. అయినా రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే చూపడంతో రైతుబంధు సొమ్ము వారి ఖాతాల్లో ఇంకా జమ అవుతూనే ఉంది. అయితే ఇటీవల ప్రభు త్వం కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించి, అందులోని లోపాలను సవరించాలని ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల రైతుబంధు సొమ్మును రికవరీ కి సైతం ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చినా, ఆ భూములకు రైతుబంధు సొమ్ము జమ అవుతుండడంతో రియల్టర్ల గుండెల్లో దడ మొదలైంది.
● చౌటుప్పల్ టౌన్

చౌటుప్పల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో అక్రమ పద్ధతులతో రైతుబంధు పొందుతున్న రియల్టర్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో రైతుబంధుపై అనేక లొసుగులు బయట పడుతుండడం, కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు రికవరీయాక్ట్‌ను అమలు చేస్తుండడం వంటి పరిణామాలతో దొడ్డిదారిన రైతుబంధును అనుభవిస్తున్న రియల్టర్ల గుండెల్లో దడపుడుతోంది. రైతులనుంచి భూములను కొనుగోలుచేసి ప్లాట్లుగా మార్చి విక్రయించిన తర్వాత కూడా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం రియల్టర్ల పేర్లే వస్తున్నాయి.దీనిని అవకాశంగా తీసుకున్న రియల్టర్లు రెవెన్యూ కార్యాలయం నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకొని రైతుబంధు నిధులను యథేచ్ఛగా పొందుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎక్కడ చూసినా రియల్టర్ల రైతుబంధు గురించే చర్చ సాగుతోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం 12విడతలుగా రైతుబంధు నిధులను విడుదలచేసింది.

చౌటుప్పల్ ప్రాంతంలో..

చౌటుప్పల్ మునిసిపాలిటీతోపాటు రూరల్ మండలంలో వందలసంఖ్యలో వెలిసిన వెంచర్లు రైతుబంధు దుర్వినియోగానికి నిలయాలుగా మారిపోయాయన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా చేసిన వెంచర్లలోని ప్లాట్లను విక్రయించిన రియల్టర్లు భూములను మాత్రం తమ పేరు మీదే ఉంచుకున్నారు. అక్రమ వెంచర్లను చేసిన వందల ఎకరాల భూ ములు నేటికీ వ్యవసాయ భూములుగానే రెవెన్యూ రికార్డుల్లో కొనసాగుతున్నాయి. దీంతో రైతుబంధు నిధులు దుర్వినియోగం జరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. రియల్టర్ల బ్యాంకు ఖాతాలను తనిఖీలు చేస్తే రైతుబంధు దుర్వినియోగం వ్యవహారం బయట పడక తప్పదన్న చర్చ సాగుతోంది.

తంగడపల్లిలో..

చౌటుప్పల్ మండలం తంగడపల్లి రెవెన్యూ పరిధిలోని 217-ఈ సర్వే నంబరులోని 4.23ఎకరాల వ్యవసాయ భూమిని 2007 జూన్ 21న వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లుగా విక్రయించారు. ఈ సర్వే నెంబర్‌లోని భూమి ధరణిలో మాత్రం వ్యవసాయ భూమిగానే చూపుతుండడంతో రైతుబంధు జమ అవుతున్నట్లు సమాచారం. వ్యవసాయేతర భూమిగా మారిన 217-ఈ సర్వేనెంబర్‌కు రైతుబంధు రావొద్దని, దీనిపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చౌటుప్పల్ ఏవో నాగరాజు తెలిపారు.

రైతు బంధు నిదులను అక్రమంగా పొందడం నేరం



రైతుబంధు నిధులను అక్రమంగా పొందడం చట్టప్రకారం నేరం. అలాంటి వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపి రైతుబంధు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి.
- శేఖర్, సమాచార హక్క జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం



రైతుబంధు నిధులను అక్రమంగా పొందిన వ్యక్తుల సమాచారాన్ని అందజేసిన పక్షంలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం. సమాచారాన్ని ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. అక్రమంగా రైతుబంధు నిధులను పొందుతున్న వ్యక్తుల సమాచారాన్ని అందజేసి ప్రభుత్వానికి సహకరించాలి.
- హరికృష్ణ, తహసీల్దార్, చౌటుప్పల్

ఒక రియల్టర్

చౌటుప్పల్ ప్రాంతంలో చేసిన అనేక వెంచర్లలోని భూములు నేటికీ వ్యవసాయ భూములుగానే కొనసాగుతున్నాయని, వాటికి రైతుబంధు నిధులు పడే అవకాశం ఉందని ఓ రియల్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణం జరిగిన కొన్ని వెంచర్లు కూడా రియల్టర్ల పేరు మీదనే రెవెన్యూ రికార్డులు చూపిస్తున్నాయని, వాటిని సదరు సర్వే నెంబర్ల నుంచి తొలగించకపోవడంతో ధరణిలో వ్యవసాయ భూములుగానే వస్తున్నాయని తెలిపారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే సదరు సర్వే నెంబరు నుంచి రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని తగ్గించాలని, అలా చేయకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని ఆయన వివరించారు. రికార్డుల్లో వ్యవసాయ భూములుగా ఉండడంతోనే కొంతమంది రియల్టర్లు రైతుబంధును పొందే అవకాశం ఏర్పడిందని చెప్పారు.

గుణాత్మకమైన విద్యనందించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బీబీనగర్, జూలై 12: సాంకేతిక పద్ధతుల ద్వారా గుణాత్మకమైన విద్యను బోధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. శుక్రవారం బీబీనగర్ మండలం గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎల్ఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను ప్రభుత్వపాఠశాలలో ఏర్పాటు చేయడమంటేనే టెక్నాలజీలో గుణాత్మకమైన మార్పునకు నిదర్శనమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రియాలిటీ ల్యాబ్ బోధన విద్యార్థులకు సరికొత్త అనుభవాన్ని ఇస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఇలాంటి ఇన్నోవేటివ్ ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. ట్రస్టు ఫౌండర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే మండలానికో వర్చువల్ రియాలిటీ ల్యాబ్, మొబైల్ వ్యాన్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో నారాయణరెడ్డి తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయాలి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే సామేల్ వినతి

మోత్కూరు, జూలై 12: తుంగతుర్తి నియోజకవర్గంలోని చెరువులు, కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే సామేల్ వినతి పత్రం అందజేశారు. సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రిని గురువారం రాత్రి కలిసి పలు సమస్యలను వివరించారు. కాల్వల్లో చెట్లు పెరిగి నీరు రావడంలేదని, చెరువుల్లో పూడిక చేరిందని ఆయన మంత్రికి వివరించారు. ముఖ్యంగా ధర్మారం, రుద్రమ్మ, దుర్గం చెరువుల మరమ్మతు, పూడిక తీత, ఎస్సారెస్పీ కాల్వలో కంపచెట్ల తొలగింపుకోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అంతర్ పంటల సాగుతో అదనపు ఆదాయం

జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



ముశిపట్లలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో అనురాధ

మోత్కూరు, జూలై 12: ఆయిల్ పాం, పత్తి పంటల్లో అంతర్ పంటల సాగుతో రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ జిల్లా అధికారి కె.అనురాధ అన్నారు. శుక్రవారం మండలంలోని ముశిపట్ల గ్రామంలో ఆమె పర్యటించి పలుచోట్ల పత్తి, కంది, ఆయిల్‌పాం, పచ్చిరొట్ట, ఎరువు జీలుగ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. జీలుగ పచ్చిరొట్ట ఎరువును వాడటంతో యూరియా వాడకాన్ని 25 శాతం తగ్గించవచ్చన్నారు. పంటలకు స్థూల, సూక్ష్మ పోషకాలు అందుతాయన్నారు. ఆయిల్‌పాం తోటల్లో అంతరపంటగా కంది, పెసర, పత్తి చేలో అంతరపంటగా కంది, దోస సాగుచేయవచ్చన్నారు. ప్రతి ఏటా పంట మార్పిడి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో జె.సైదులు, రైతులు కేమిడి అంజయ్య, హనుమయ్య, పైళ్ల వెంకట్‌రెడ్డి, నేముల శేఖర్, బాలెంల సైదులు, రమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ

- జిల్లా ఆస్పత్రికి మిషన్ భగీరథ జలాలు
- అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి టౌన్, జూలై 12: జనావాసాల మధ్య కుంటలలోని మురుగునీరు, గృహాల్లోని నిరుపయోగ వస్తువులలోని నిల్వ నీటిని నివారిస్తేనే సీజనల్ వ్యాధుల నియంత్రణ సాధ్యమని అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన డ్రైడేలో ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మురుగు నీటి గుంతలు, మురుగుక్వాలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేసి రసాయనాలు పిచికారీ చేసి మాట్లాడారు. నిరుపయోగ తొట్లు, కూలర్లు, కొబ్బరి చిప్పలు తదితర వస్తువుల్లోని నిల్వనీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇందుకోసం అందరూ ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రిని పరిశీలించి వార్డుల్లో పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. ఐపీ రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రోగులకు చికిత్స అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని, మందుల స్టాకుపై జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్న పిల్లల వార్డులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైడేను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆస్పత్రికి మిషన్ భగీరథ జలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిఖార్జున్, ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్ రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీపీవో సునంద

మోటకొండూరు,జూలై 12: ప్రజలు సరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో సునంద అన్నారు. శుక్రవారం మండలంలోని మాటూరు, ఇక్కుర్తి, అమ్మనబోలు గ్రామాలను సందర్శించి మాట్లాడారు. రోడ్లపై ఉన్న మురుగునీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇళ్లముందు ఉండే డ్రమ్ములు, నీటి తొట్లపై మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో కిషన్,పంచాయతీ కార్యదర్శి అశోక్,రమేష్ పాల్గొన్నారు.



అమ్మనబోలులో మురుగుకాల్వలను పరిశీలిస్తున్న డీపీవో సునంద

ఎకరాకు రూ.80లక్షలు చెల్లించాలి

ఆర్డీవో శేఖర్‌రెడ్డికి విన్నవించిన భూనిర్వాసితులు



భూనిర్వాసితులతో సమావేశమై అభిప్రాయాలు స్వీకరిస్తున్న ఆర్డీవో శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూలై 12: గౌరెల్లి-భద్రాచలం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.80లక్షల నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డిని భూనిర్వాసితులు కోరారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో రెండోరోజున కనుముకుల, దంతూరు గ్రామాల రైతులతో ఆర్డీవో సమీక్ష సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. జాతీయ రహదారి నిర్మాణంలో దంతూరు గ్రామానికి చెందిన 25.05 ఎకరాల భూమి, కనుముకుల గ్రామంలో 26 ఎకరాల గుంటన్నర భూమిని ప్రభుత్వం సేకరించింది. రైతుల అభిప్రాయాలను సేకరించిన ఆర్డీవో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఇంకా ఏమైనా సందేహాలు, అభిప్రాయాలున్నా, ఎక్కువ నష్టపరిహారం కావాలనుకుంటే కలెక్టర్‌కు విన్నవించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, డీటీ వెంకటయ్య, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను పట్టించుకోని పాలకులు

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్

ఆలేరు రూరల్, జూలై 12: చేనేత కార్మికులను పాలకులు పట్టించుకోవడంలేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్ ఆరోపించారు. శుక్రవారం ఆలేరులో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేత మిత్ర బీమాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలన్నారు. ఇప్పుడు ఇస్తున్న రూ.2వేల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలన్నారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీపై నూలు అందజేయాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ చింతకింది మురళీ, చింతకింది మల్లేశ్, నర్సింహులు, శ్రీను, వెంకటేష్, దత్తు, పాండరి, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ జనార్ధన్

జిల్లాలో కురిసిన వాన

మెట్ట పంటలకు మేలుచేసిన వర్షం



భువనగిరి పట్టణంలో కురుస్తున్న వాన

భువనగిరి టౌన్,జూలై 12: జిల్లా కేంద్రం భువనగిరిలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడి పలు దఫాలుగా చిరుజల్లులు కురిశాయి. వారం రోజులుగా ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం కలిగింది. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు ప్రవహించి కొద్దిసేపు ఇబ్బందులు కలిగాయి.

మోత్కూరు: మోత్కూరు మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు 20 రోజులుగా వర్షాలు కురవక వాడిపోతున్న పత్తి, కంది, తదితర మెట్ట పంటలకు ఈ వర్షం జీవం పోసినట్లయ్యింది. వర్షం కురవడంతో పత్తి చేలకు రేపటినుంచి ఎరువులు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. పశువులు మేయడానికి పచ్చిగ్రాసం పెరగడానికి కూడా ఈ వర్షం దోహదపడుతుంది. భారీ వర్షాలు కురిస్తేనే ఇటు చేలకు మరింత మేలు జరుగుతుందని రైతులంటున్నారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉండగా, సాయంత్రం ఒక్కసారి చల్లని గాలులు వీస్తూ ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. కురిసిన వర్షంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ



అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 12: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి సన్నిధిలో స్వర్ణపుష్పార్చన, ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలతో, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, వజ్రవైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు ఆగమశాస్త్రరీతిలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా చేపట్టారు. అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమపద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.28,20,554 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, నటరాజ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విజయ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. స్వామివారిని దర్శించుకునేందుకు యాదగిరిగుట్టకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన జయకస్తూరికి సంబంధించి ఐఫోన్ అపహరణకు గురికాగా ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీఎఫ్ సిబ్బంది రామకృష్ణ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను పరిశీలించి దొంగిలించిన వ్యక్తిని పట్టుకుని, స్థానిక పోలీసులకు అపహరించిన ఐఫోన్‌ను బాధితురాలికి అప్పగించారు.

రహదారిపై లారీ బోల్తా

చింతపల్లి, జూలై 12 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ శివారు నాగార్జునసాగర్ -హైదరాబాద్ రాష్ట్ర రహదారిపై శుక్రవారం లారీ బోల్తాపడింది. జగ్గయ్యపేట నుంచి వస్తున్న సిమెంట్ రేకుల లారీ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి గాయాలుకాలేదు.



కుర్మేడు గ్రామ శివారులో బోల్తాపడిన లారీ

ఇసుక కోసం పాలేరు వాగు గుల్ల

● నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు
● ట్రాక్టర్‌కి రూ.5 వేల వరకు వసూలు
● పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

మోతె, జూలై 12 : వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోయిన పాలేరు వాగును ఇసుక అక్రమదారులు ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. యేరులో ఏళ్లుగా పేరుకున్న ఇసుక అధికార పార్టీ నాయకులకు కల్పతరువుగా మారింది. రెండు నెలలుగా ఏరుకు ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన మహిళా నాయకురాలు, మరో మాజీ ప్రజాప్రతినిధి కలిసి మండల నాయకులకు ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున ముట్టజెప్పి ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అటుగా వెళ్లకుండా నాయకులు చూసుకుంటున్నట్లు సమాచారం.

సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మోతె మండలంలోని పాలేరు వాగు విస్తరించి ఉన్నది. ఖమ్మం జిల్లాలోని జలాశయానికి ఆనుకుని ఉన్న వరకు నీరులేకపోవడంతో ఇసుక తోడిన కొద్దీ ఇసుక లభిస్తోంది. దీంతో ప్రతి రోజూ సుమారు 100 ట్రాక్టర్లకు పైబడే ఇసుకను తరలిస్తున్నారు. మోతె మండలంలోని నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరేడువాయి, రంగాపురంతండా, రాయికుంటతండా, అన్నారిగూడెం, గోపతండ గ్రామాల పరిధిలో వాగు సుమారు మూడు కిలోమీటర్ల విస్తరించి ఉంది. ఇందులో నుంచి ఈ గ్రామాలకు చెందిన వారు నిత్యం అక్రమంగా వాగులో పెద్ద గోతులు తీసి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ట్రాక్టర్లు ఉన్న ప్రతి ఒక్కర ఊ అధికార పార్టీ నాయకుల వద్ద నెలవారీ చెల్లింపులు చెల్లించిన తర్వాతనే ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అడ్డుకునే ప్రయత్నాలు అధికారుల్లో కనిపించడం లేదు.



ఉర్లుగొండ-నర్సింహాపురం గ్రామాల పరిధిలోని పాలేరు వాగులో ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

100 ట్రాక్టర్ల పైబడే..

రెండు నెలల నుంచి నిత్యం వాగు నుంచి 100 ట్రాక్టర్ల పైబడే ఇసుకను తరలిస్తున్నారు. మొదట్లో అధికార పార్టీ నాయకులకు చెందిన వారు మాత్రమే తరలించగా మెల్లగా ఏరుకు ఆనుకుని ఉన్న నాయకుల అండతో మిగతా ట్రాక్టర్ల వారు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నర్సింహాపురం గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో వారిపై దాడులకు దిగారు. వారి వివరాలు ట్రాక్టర్ల వారికి, పైరవీకారులకు అందజేయడంతో వారు దుర్భాషలకు దిగుతున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులు బ్రిడ్జికి ఆనుకుని వెళ్తుండటంతో రాళ్ల తేలి పిల్లర్లు కుంగే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లకు నెంబరు ప్లేట్స్, కాగితాలు ఉండవు. మైనర్లు ట్రాక్టర్లను నిర్వహిస్తున్నారు. యేరుకు ఆనుకుని ఉన్న రైతుల భూముల్లో నుంచి వందల ట్రాక్టర్లు వెళ్తుండటంతో పొలాలు ధ్వంసమవుతున్నాయి. వాగులో వేసిన విద్యుత్ మోటార్ల పైపులు, విద్యుత్ తీగలు, మోటార్లు పగిలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉర్లుగొండ గ్రామానికి చెందిన వ్యక్తి తుమ్మలపల్లిలో ఇసుకను తరలిస్తూ అతివేగంతో ఢీకొట్టడంతో గ్రామానికి చెందిన మంద ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది జరిగి రోజులు గడవక ముందే ఇష్టానుసారంగా ట్రాక్టర్లల్లో టేప్ రికార్డులను పెట్టుకుని అతివేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. దీంతో వెనకాల వస్తున్న వారికి ఇబ్బంది కలుగుతోంది. పర్యవేక్షణ చేయాల్సిన పోలీసులు, వాహన తనిఖీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

10 శాతం కేసులు కూడా నమోదు లేదు

రెండు నెలల పైబడి వాగు నుంచి ఇష్టానుసారం ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా పట్టుమని 10 శాతం కేసులైనా నమోదుకాలేదు. వాగులో రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తు జాతరను తలపిస్తున్నా రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, శాఖల అధికారులకు కనిపించవని రైతులు వాపోతున్నారు. ప్రతి రోజూ వాగు నుంచి రూ.లక్షల విలువైన విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఖమ్మం, నేలకొండపల్లి, కోదాడకు ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. రెండు నెలల్లో ఒక్క ట్రాక్టర్ ఇసుకైనా పట్టుబడి మైనింగ్‌కు అప్పజెప్పిన సంఘటనలు లేవు.

వేగంగా వెళ్తున్న ట్రాక్టర్లతో ఇబ్బందులు

వాగులో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు ఇష్టానుసారం వెళ్లడంతో వాగుకు ఆనుకుని ఉన్న బోర్లు, విద్యుత్ మోటార్ల తీగలు, పైపులు పగిలిపోతున్నవి. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు దిగు తున్నారు. అతివేగంతో నడపడంతో వాగులో నుంచి పొలాలకు వేసుకున్న పైపులు పగిలిపోతున్నాయి.ఇసుకను అక్రమంగా తరలించడమే కాకు ఒడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

● రాంరెడ్డి, రైతు

ఇసుకను తరలిస్తే చర్యలు

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి కట్టడికి చర్యలు చేపడతాం. ఎంతటివారైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

వేణుమాధవ్, ఆర్డీవో

దాడి చేస్తూ.. సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ...

● సూర్యాపేట పేటలో యువకుల వీరంగం

సూర్యాపేటక్రైం, జూలై 12 : సూర్యాపేట పట్టణంలో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. ఈ నెల 10వ తేదీ రాత్రి సమయంలో సూర్యాపేటలోని నిర్మల ఆసుపత్రి సమీపంలో ఓ యువకుడిని ఐదుగురు యువకులు కలిసి చితకబాదారు. ఇటీవల తమ మిత్రుడిపై దాడికి పాల్పడ్డాడని ప్రతి దాడికి దిగారు. సూర్యాపేటలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువకుడిపై ఇటీవల చంద్రన్నకుంటకు చెందిన ఆదివంశీ అనే యువకుడితో పాటు మరికొందరు కలిసి దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని దాడిలో గాయపడిన యువకుడు రాజీవ్‌నగర్‌కు చెందిన తన మిత్రులకు తెలిపాడు. దీంతో వారంతా ప్రతిదాడి చేసేందుకు వెతకసాగారు. అయితే దాడికి పాల్పడ్డ వారిలో ఒకరైన ఆదివంశీ ఈ నెల 10వ తేదీన రాత్రి సమయంలో నిర్మల ఆసుపత్రి సమీపంలో ఉన్నాడనే విషయాన్ని తెలుసుకున్నారు. ఐదుగురు యువకులు బైక్‌లపై అక్కడికి చేరుకుని ఆదివంశీపై విచక్షణరహితంగా దాడి చేశారు. సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ మరీ దాడి చేశారు. గమనించిన స్థానికులు దాడి చేయవద్దని వారించినా యువకులు లెక్క చేయలేదు. రాళ్లు, ఇటుకలు, కర్రలు తీసుకుని దాడి చేశారు. అనంతరం దాడిలో గాయపడిన యువకుడిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం స్థానికుల సాయంతో దాడిలో గాయపడిన యువకుడు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం స్థానికంగా సోషల్‌మీడియాలో వీడియోలు వైరల్ కావటంతో విషయం వెలుగుచూసింది.



ఆదివంశీ అనే యువకుడిపై దాడిచేస్తున్న యువకులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సూర్యాపేటలో ఈ నెల 10వ తేదీ రాత్రి కొందరు యువకులు ఓ యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ జీ రవి శుక్రవారం పరిశీలించారు. ఘటనా స్థలంలో దాడి జరిగినపుడు అక్కడ ఉన్న స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ రవి మాట్లాడుతూ పట్టణంలో కొందరు యువకులు కక్షతో ఒక యువకుడిపై దాడికి పాల్పడిన విషయమై కేసు నమోదు చేశామన్నారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తామన్నారు. పట్టణంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మత్తులో ఇతరులపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్



మిర్యాలగూడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూలై 12 : ప్రేమ పేరుతో వేధించి యువతి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. మాడ్గులపల్లి మండలం కుక్కడం ఆవాసం చింతగూడెం గ్రామానికి చెందిన కొత్త కల్యాణి(18)ని అదే గ్రామానికి చెందిన ఆరూరి శివ, కొమ్మనబోయిన మధు ప్రేమించమని, పెళ్లి చేసుకోవాలని వేధించారు. లేదంటే తమతో దిగిన ఫోటోలను వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్ గ్రూపుల్లో డీపీలుగా పెడతామని, కాల్ రికార్డులు బయట పెడతామని బెదిరించారు. వారి వేధింపులు భరించలేక ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్యాణి క్రిమిసంహారక మందు తాగింది. ఇంటి చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. మెరుగైన చికిత్సకోసం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదీ మృతి చెందింది. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ వీరబాబు పర్యవేక్షణలో మాడ్గులపల్లి ఎస్ఐ జీ శోభన్‌బాబు, సిబ్బంది పరారీలో ఉన్న నిందితుల్లో ఒకరైన శివను చింతలగూడెం గ్రామంలో, మధును మాడ్గులపల్లి టోల్‌ప్లాజా వద్ద అరెస్ట్ చేసి వారిద్దరి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్‌తో ఏడుగురికి అస్వస్థత

చౌటుప్పల్ రూరల్, జూలై 12: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని రసాయన పరిశ్రమలో గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శ్రీ జయల్యాబ్ పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు రియాక్టర్ వద్ద ప్రమాదవశాత్తు వాయువు లీకైంది. ఈ ఘటనతో రియాక్టర్ వద్ద పనిచేస్తున్న ఏడుగురు కార్మికులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన నేలపట్ల నాగబాబు(23), లలిత్‌పెట్టి (25), తూర్పుగోదావరి జిల్లా గూడజాలానికి చెందిన జె.చిన్నబాబు (21), ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పొత్తూరుకు చెందిన ఎల్లమల్ల శ్రీనివాస్‌రావు (41), యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం గ్రామానికి చెందిన కొండూరు గిరిబాబు (30), హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన పోతూరి కృష్ణంరాజు, చౌటుప్పల్ మండలానికి చెందిన నర్ర గోపిలు వాయువు పీల్చి స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. ఇందులో ముగ్గురు కార్మికులకు ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మిగతావారికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు. నాగబాబు భార్య గౌతమి స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్ఆర్‌యూ చోరీలో కీలక నిందితుడి అరెస్టు

నల్లగొండ క్రైం, జూలై 12 : కొంతకాలంగా ఎయిర్‌టెల్ టవర్ రేడియో రిమోట్ యూనిట్(ఆర్ఆర్‌యూ)లను చోరీ చేస్తున్న కీలక నిందితుడు ధీరావత్ నగేష్‌ను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఈ కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు కీలక నిందితుడు మిర్యాలగూడ మండలం ధీరావత్ తండాకు చెందిన నగేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ధీరావత్ నగేష్‌ను నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డి, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరితో పాటు స్థానిక సిబ్బంది నార్కట్‌పల్లి వద్ద అరెస్టు చేశారన్నారు. ధీరావత్ తండాకు చెందిన ఐదుగురు కలిసి ముఠాగా ఏర్పడి ఎయిర్‌టెల్ టవర్‌లోని ఆర్ఆర్‌యూలను చోరీ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన మున్నా అనే వ్యక్తికి తక్కువ ధరలకు విక్రయిస్తూ వస్తున్నారని, ఈ ముఠాలో నగేష్ కీలక వ్యక్తి అని వివరించారు. నగేష్‌పై మొత్తం 17చోరీ కేసులు ఉన్నాయని, గతంలోనే 8 కేసుల్లో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చాడన్నారు. ఇతడిపై ఏపీలోని అనంతపురం జిల్లా రాయపర్తిలో కూడా కేసు నమోదైందని, ఏపీలోని గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, నల్లగొండ, సూర్యాపేట, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కూడా చోరీ కేసులు నమోదయ్యాయని వివరించారు.ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆర్ఆర్‌యూల రిసీవర్ హైదరాబాద్‌కు చెందిన మున్నా పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వివరించారు.

సూర్యాపేట జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు

షోకాజ్‌నోటీసులు జారీ

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 12 : సూర్యాపేట జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో అశోక్‌కుమార్ మునగాల, కోదాడ, మఠంపల్లి, అర్వపల్లి, చిలుకూరు మండలాల్లో పలు పాఠశాలలను సందర్శించారు. కాగా ఉన్నతఅధికారుల అనుమతి లేకుండా పాఠశాల విధులకు గైర్హాజరైన మునగాల మండలం ఆకుపాముల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షేక్ దస్తగిరి, చిలుకూరు మండలం ఆచార్యులగూడెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కే రాంరెడ్డి, కోదాడ మండలం కొమరబండ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పీ గోవిందయ్య, మఠంపల్లి మండలం అల్లీపురం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శేషిరెడ్డి, మద్దిరాల మండలం కుక్కడం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కే కృష్ణారెడ్డి, పెన్‌పహాడ్ మండలం సింగిరెడ్డిపాలెం మండల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బీ నరేందర్, అదేపాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అర్వపల్లి మండలం ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అపరాజిత రెడ్డిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠా సభ్యుల అరెస్టు

నల్లగొండ క్రైం, జూలై 12 : కుటుంబ సభ్యులతో కలిసి ముఠాగా ఏర్పడి ప్రభుత్వ పాఠశాల్లో డిజిటల్ క్లాసుల కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీలను చోరీచేస్తున్న ముఠాలను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.7.18 లక్షల విలువైన 100 బ్యాటరీలు, ట్రాలీ ఆటో, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి పూర్తి వివరాలను వెల్లడించారు.

నకిరేకల్‌కు చెందిన పలువురు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన విలువైన బ్యాటరీలను చోరీ చేసేందుకు రెండు ముఠాలుగా ఏర్పడ్డారు. నకిరేకల్ పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన గోపాగాని జగన్, ఆవుల తిమ్మయ్యతో పాటు మరో 10 మంది ఒక ముఠాగా, అదే ప్రాంతానికి చెందిన ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజుతో పాటు మరో నలుగురు కలిసి మరో ముఠాగా ఏర్పడి వేర్వేరుగా బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. కొంతకాలంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాటరీలు చోరీకి గురవుతుండగా విద్యాశాఖ అధికారుల ఫిర్యాదుమేరకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి సారించి ఆయన ఆదేశాల మేరకు నేర విభాగంలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో నల్లగొండ సీసీఎస్, శాలిగౌరారం పోలీసులు సంయుక్తంగా కలిసి నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా బ్యాటరీల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న ట్రాలీ ఆటోను శాలిగౌరారం ఎక్స్‌రోడ్డు వద్ద ఆపి తనిఖీ చేశారన్నారు. ఆటోలో ఉన్న డ్రైవర్ గోపాగాని జగన్‌తో పాటు మరో వ్యక్తి ఆవుల తిమ్మయ్యని అదుపులోకి తీసుకుని విచారించగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాటరీలను చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. ముఠాకు చెందిన మరో 10 మంది పరారీలో ఉండగా అందులో ఆరుగురు మహిళలు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా వీరిచ్చిన సమాచారం మేరకు మరో ముఠాకు చెందిన ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజును కూడా నకిరేకల్‌లో అరెస్టు చేశామన్నారు. ఈ ముఠాకు చెందిన నలుగురు మహిళ నేరస్తులు పరారీలో ఉన్నట్లు వివరించారు.



బ్యాటరీలను ప్రదర్శిస్తూ చోరీ చేసిన ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

గతంలోనూ నేరాలు

రెండు ముఠాలుగా ఏర్పడి బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న నిందితులు గతంలో నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. గతంలో వీరంతా జైలుకు వెళ్లినా వారిలో పరివర్తన రాకపోగా తిరిగి కుటుంబసభ్యులతో సహా చోరీచేయాలని నిర్ణయించుకుని అనుకున్న ప్రకారం రెండు ముఠాలుగా విడిపోయి చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

17 ప్రభుత్వ స్కూళ్లలో బ్యాటరీలు చోరీ

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ రెండు ముఠాలు చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. నల్లగొండ జిల్లాలోని కట్టంగూరు, శాలిగౌరారం, కేతేపల్లి, నకిరేకల్, తిప్పర్తి, మాడ్గులపల్లి, సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట రూరల్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), అర్వపల్లి మండలాల్లోని 17 ప్రభుత్వ పాఠశాల్లో బ్యాటరీలను చోరీ చేశారన్నారు. ముఠా సభ్యులను పట్టుకోవడంలో కృషి చేసిన సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, ఎస్ఐలు డీ సైదులు, గోపికృష్ణ, అయిలయ్య, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి, సిబ్బంది లింగారెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు పలువురిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీసుల అదుపులో పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యుడు?

● ఇప్పటికే రిమాండ్‌లో ఇద్దరు

నల్లగొండ క్రైం, జూలై 12 : కరుడుగట్టిన అంతర్రాష్ట్ర పార్థీ గ్యాంగ్‌కు చెందిన ముఠా సభ్యుడిని నల్లగొండ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నెల 6వ తేదీన నల్లగొండ జిల్లా పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా హైదరాబాద్ సమీపంలోని అవుటర్ రింగ్ రోడ్డు వద్ద గ్యాంగ్‌కు చెందిన మహారాష్ట్రలోని పూణె జిల్లా ఇందాపూర్‌కు చెందిన కీలక నిందితులైన అప్ప పాండ్రంగా, అహ్మద్ నగర్ జిల్లా దుదువేడికి చెందిన శుభం అశోక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరీపూర్‌కు చెందిన కాశ్మీర్ శశిపాల్ భోంస్లే, పూన జిల్లా ఇందాపూర్‌కు చెందిన అధేష్ అనిల్ ఖలే పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఇద్దరి కోసం పోలీసులు ముమ్మరంగా వేట ప్రారంభించి పరారీలో ఉన్న నిందితుల్లో కాకుండా ముఠా సభ్యుడైన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మహారాష్ట్రకు చెందిన గ్యాంగ్ సభ్యుడైన అనిల్‌కపూర్‌ను జిల్లా పోలీసులు మహారాష్ట్రకు వెళ్లి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ముఠాను అరెస్టు చేసేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు, సూచనల మేరకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న గ్యాంగ్ సభ్యుడు గ్యాంగ్ లీడర్ అప్ప పాండ్రంగా పిలిచిన సమయంలో వచ్చి అతడు చెప్పినట్లు చేసినందుకు అనిల్‌కపూర్‌కు రోజూ కూలీగా చెల్లించే వాడని సమాచారం. ఈ గ్యాంగ్ ఎక్కడెక్కడ చోరీలు, నేరాలు చేశారనే కోణంలో పోలీసులు అనిల్‌కపూర్‌ను విచారిస్తున్నట్లు తెలిసింది. గ్యాంగ్ నేరాలు చేసిన ప్రాంతాలకు తీసుకెళ్లి ఏవిధంగా నేరాలు చేశారు, ఎక్కడెక్కడ ఏం చేశారనే కోణంలో పోలీసులు చేస్తున్న దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సూర్యాపేట క్రైం, జూలై 12 : అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుసుమవారిగూడెం శివారు వద్ద జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామానికి చెందిన తిరుగుడు వెంకన్న(48) తన ట్రాక్టర్‌పై పనినిమిత్తం సూర్యాపేటకు వస్తున్నాడు. అయితే సూర్యాపేట పట్టణ శివారు కుసుమవారిగూడెం వచ్చేసరికి రోడ్డుపై ఏర్పడిన గుంతను గమనించకపోవడంతో ఆ గుంతలో పడి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ వెంకన్నపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వెంకన్న కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీ కొట్టడంతో వృద్ధుడి..

ఆత్మకూర్(ఎస్), జూలై 12 : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి యల్లయ్య(68)ను బైక్ ఢీకొనడంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యల్లయ్య తన ఇంటి నుంచి గేదెలను తీసుకుని వెళ్తుండగా గుర్తుతెలియని బైక్ వేగంగా వచ్చి ఆయన్ను బలగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన యల్లయ్య అక్కడికక్కడ మృతి చెందాడు. బైక్‌పై ఇద్దరూ వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఢీ కొట్టిన బైక్ ఆపకుండా వేగంగా వెళ్లినట్లు తెలిపారు. యల్లయ్య కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. యల్లయ్యకు భార్య , కుమార్తె, కుమారుడు ఉన్నారు. యల్లయ్య మృతికి సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ, పీవైఎల్ సంఘాల నాయకులు సంతాపం తెలిపి, నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ పెయింటర్..

భువనగిరిటౌన్, జూలై 12 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన పెయింటర్ జెర్రిపోతుల మల్లేశం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 14న స్థానిక ఖాజీమహల్లాలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మల్లేశంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

మాడ్గులపల్లి, జూలై 12 : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లికంటి రాములు, త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీనులు వేములపల్లిలోని సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరై తిరిగి మాడ్గులపల్లి వైపు టీవీఎస్ మోపెడ్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఇద్దరిని మిర్యాలగూడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. శ్రీను కుమారుడు దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

లారీ ఢీకొని ఒక వ్యక్తికి..

పాలకవీడు, జూలై 12 : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య సంఘటనా స్థలానికి చేరుకోని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన షాబుద్దీన్(42) శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై జాన్‌పహాడ్ దర్గాలో తన బంధువుల కందూరుకు హాజరై వస్తుండగా పాలకవీడు మండంల కోమటికుంట గ్రామం శివారులో లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. షాబుద్దీన్‌కి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. లారీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మేకల దొంగలకు జరిమానా

రామన్నపేట, జూలై 12 : మేకలను దొంగిలించిన ఇరువురికి యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ జరిమానా విధించారు. ఒక్కొక్కరికీ రూ.6 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. మునిపట్ల గ్రామానికి చెందిన భూషపాక పురుషోత్తం(25) షాకపురం నవీన్(25)లు మోత్కూరు మండలం బుజిలాపురం, పాటిమట్ల గ్రామాల్లో మేక పోతులను దొంగతనం చేసి 2022లో అరెస్టయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాలను రామన్నపేట కోర్టులో ప్రవేశపెట్టారు. రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ కేసు విచారణ చేసి, పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాల ఆధారంగా దోషులు ఇద్దరికి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, జూలై 12: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లన పట్టుకుని కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల నరేష్, పిట్టల ప్రవీణ్, పజ్జూరు లింగస్వామి మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ డీలర్లు బియ్యం కొంటే లైసెన్స్ రద్దు


చిట్యాల రూరల్, జూలై 12 : లబ్ధిదారుల నుంచి డీలర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని పౌర సరఫరాల శాఖ డీటీలు దున్న లింగస్వామి, ఎస్‌కే బీ జావిద్, జ్యోతి హెచ్చరించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వనిపాకల, వట్టిమర్తి గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బియ్యం నిల్వలు, రికార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు కలెక్టర్, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఆదేశానుసారం రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యాన్ని డీలర్లు కొనుగోళ్లు చేస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. డీలర్లు లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేసే సమయంలో కొనుగోళ్లు చేసినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అంతేకాకుండా ఆయా డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులు విక్రయిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, చర్యలే కాకుండా వారి రేషన్‌కార్డులను రద్దు చేస్తామన్నారు. రేషన్ బియ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు ఉంటాయన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 12 : నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంపై శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ అధికారులు దాడులు నిర్వహించారు. సరుకులు అక్రమంగా పక్కదారి మళ్లిస్తున్నారన్న ఆరోపణల మేరకు దాడులు నిర్వహించారు. 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో డీలర్ టీ విలమ్మపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తిప్పర్తి, జూలై 12 : కూలి పనులకు వెళ్లిన వివాహిత అదృశ్యంపై నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెం దిన బండారు శివకృష్ణ తన భార్య ఈరమ్మతో కలిసి నాలుగేళ్ల కిందట తిప్పర్తి గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. వీరికి మూడేళ్ల బాబు ఉన్నాడు. ఈ నెల 9వ తేదీన ఈరమ్మ కూలీ పనులకు వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.



ఈరమ్మ

కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం

అడ్డగూడూరు, జూలై 12: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో శుక్రవారం కుళ్లినస్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చౌళ్లరామారం గ్రామానికి చెందిన దోంతోజు నరసింహాచారి(45)బుధవారం తన ఇంట్లో రాత్రి రోజువారీగా మద్యం తాగి పడుకున్నాడు. శుక్రవారం నరసింహాచారి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇరుగు పొరుగు వారు కిటికీ లను తెరిచి చూడగా నరసింహాచారి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. భార్య రమ వారం రోజుల కిందట హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తన పిల్లలు ప్రవీణ్, పూజితల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న వారు గ్రామానికి చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.



నరసింహాచారి(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య

వలిగొండ, జూలై 12 : ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన చేగూరి శ్రీనివాస్(45) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, వివాహితులైన కుమార్తె, అవివాహితులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల కిందట కుమార్తె వివాహం కోసం దాదాపు రూ.5లక్షలు ఖర్చుచేశాడు. ఇతరుల దగ్గర నుంచి తీసుకువచ్చిన అప్పులు తిరిగి చెల్లించలేక మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. అతడి కుమారుడు ఇంటికి వచ్చి చూసే సరికి విగతజీవితగా పడిఉన్నాడు. భార్య అరుణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని మినీ శిల్పారామం



మూసి ఉన్న మినీ శిల్పారామం, స్వాగత ద్వారం

నిరాశకు లోనవుతున్న భక్తులు

భువనగిరి రూరల్, జూలై 12: జిల్లా కేంద్రం శివారులోని రాయిగిరి చెరువు కట్ట సమీపంలో మినీ శిల్పారామం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రాయిగిరి- యాదాద్రి పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గమధ్యలో గత నా లుగేళ్ల క్రితం మినీ శిల్పారామం ఏర్పాటుకు యాదా ద్రిదేవస్థాన అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) యాత్రికులకు మానసికప్రశాంతత కోసం వివిధ రకాల ఏర్పాటుతో సరికొత్తగా మినీ శిల్పారామం ప్రాంగణాని కి శ్రీకారం చుట్టింది. తెలంగాణ తిరుపతిగా బావిస్తూ ఈ ఆలయానికి ఆధ్యాత్మికతతో వచ్చే భక్తజనులకు ఆహ్లా దం పంచడానికి రాయిగిరి చెరువు ప్రాంగణంలోనే సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వివిధ హం గులతో మినీ శిల్పారామం ఏర్పాటు అయింది. సుమా రు రూ.2కోట్ల వ్యయంతో నిర్మితమైన శిల్పారామంలో పచ్చని పార్కులు, వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట ప్రాంగణం, చెరువులో ఫౌంటెయిన్‌లు,ఆట బొమ్మలు, కుటుంబీకులు సేదతీరే స్పాట్స్‌ను ఆధునిక హంగుళతో ఏర్పాటు చేశారు. నలుగురితో కూడిన కుటుంబ జలవిహారం చేసేలా బోటింగ్ వంటి వసతి కల్పించారు. ఒడిసా బొమ్మలు, ఫుడ్ కోర్టు(రెస్టారెంట్‌తో పాటు రెండు చోట్ల నిర్మితమైన తోరణాలు యాత్రికులను స్వాగతిస్తున్నట్లు ఏర్పాట్లు చేశారు. అయితే నాలుగేళ్ల నుంచి నిర్మా ణ పనులు కొనసాగుతూ అన్ని హంగులతో మినీ శిల్పారామం పనులు ఆరు నెలల క్రితమే పూర్తయ్యాయి. మినీ శిల్పారామాన్ని ప్రా రంభించకపోవడంతో అందులో ఏర్పాటు చేసిన కొన్ని పరికరాలు, వస్తువులు కళ కోల్పోయే పరిస్థితి ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఈ శిల్పారామాన్ని ప్రారంభించి ఆహ్లాదం అందించాలని పలువరు కోరుతున్నారు.



చిన్నారుల ఆట పరికరాలు

మినీ శిల్పారామాన్ని వెంటనే ప్రారంభించాలి



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు ఆహ్లాదం పంచేందుకు వైటీడీఏ ఆధ్వర్యంలో మినీ శిల్పారామం ఏర్పాటుకు సంకల్పించారు. అయితే 2020 సంవత్సరంలో ఈ పనులు ప్రారంభమై వివిధ హంగులతో పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికే అందులోని కొన్ని పరికరాలు నిర్వీర్యమై పోతున్నాయి. వెంటనే మినీ శిల్పారామాన్ని ప్రారంభించి భక్తులకు ఆహ్లాదం పంచాలి.

- హనుమంతు, మాజీ ఎంపీటీసీ రాయిగిరి



శిల్పారామంలోని వాకింగ్ ట్రాక్

ఆరోగ్య ప్రపంచం కోసం జనాభా నియంత్రణ అవసరం



విజేతలకు జ్ఞాపికలను అందజేసిన సీఎంవో లింగారెడ్డి

భువనగిరి అర్బన్/ భువనగిరిటౌన్, జూలై 12: ఆరోగ్యకర ప్రపంచం నిర్మాణం కోసం జనాభా నియంత్రణ అవసరమని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి తెలిపారు. ప్రపంచ జనాభా నియంత్రణ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెన్నెల కళాశాలలో గోడ పత్రిక తయారీ పోటీలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం జనాభా నియంత్రణ, ఆరోగ్య జీవన విధానం అనే అంశాల్లో గోడ పత్రిక తయారీ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ఎస్.శ్రీకళ (పదో తరగతి, ఆదర్శ పాఠశాల చౌటుప్పల్) ప్రథమ బహుమతి, పి.సాయికుమార్ (పదో తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్వర్తి) ద్వితీయ బహుమతి, ఎస్‌కే.జోయాజోబీన్ (9వ తరగతి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రామన్నపేట) విజేతలుగా నిలిచారని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మీ, రమాదేవి, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

భువనగిరి రూరల్, జూలై 12: పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సామాజిక వేత్త డాక్టర్ కస్తూరి లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం వీరవెల్లి జడ్పీ హైస్కూల్‌లో డాక్టర్ లక్ష్మీనారాయణ సొంత నిధులు వెచ్చించి విద్యార్థులందరికీ టైలు, బెల్టులు, షూలు, ఐడీ కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని తల్లిదండ్రులు ఎలాంటి బేషజాలకు పోకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ కస్తూరి శ్రీలత, మాజీ ఎంపీటీసీ కంచి లలిత మల్లయ్య, మాజీ సర్పంచ్ తంగెళ్లపల్లి కల్పన శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు శామ సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికోసం ఎదురుచూపు



పాఠశాల తెరవకపోవడంతో బయట వేచి ఉన్న విద్యార్థులు

గుండాల, జూలై 12: మండలంలోని వస్తాకొండూరు గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9గంటలకు పాఠశాలకు రావాల్సిన ఉపాధ్యాయులు 10.15 నిమిషాలు అవుతున్నప్పటికీ రాలేదు.. గదికి తాళం వేసి ఉండడంతో బడికి వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారో అని ఎదురు చూశారు. ఈ విషయమై ఎంఈవో శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయురాలు సుధారాణి ఉండగా ఆమె సెలవుపై వెళ్లారు. సమీపంలోని బండకొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వై.శ్రీధర్‌ను ఒక్క రోజుతాత్కాలిక డిప్యూటేషన్‌పై పంపించగా కొంత సమయం ఆలస్యమైందని ఎంఈవో పేర్కొన్నారు.

ముత్యాల లక్ష్మమ్మకు ఘన నివాళి



లక్ష్మమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 12 : బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు, భువనగిరి వ్యవసాయ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్‌రెడ్డి తల్లి ముత్యాల లక్ష్మమ్మకు జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఘన నివాళి అర్పించారు. శుక్రవారం మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో లక్ష్మమ్మ మృత దేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముత్యాల జైపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాంపాల్‌రెడ్డిలను ఓదార్చి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మాద్గుల ప్రభాకర్‌రెడ్డి, బడుగు దానయ్య, కొమిరెల్లి నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశంయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచు దుర్గం స్వప్న నరేష్, ఎల్లంకి మాజీ సర్పంచు మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, నాయకులు బత్తుల శ్రీశైలంగౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

మోత్కూరు, జూలై 12: సాంఘిక సంక్షేమ సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరిగారి ప్రీతంను శుక్రవారం మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, కాంగ్రెస్ మోత్కూరు పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

తుర్కపల్లి, జూలై 12: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి బోడ భాగ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం మంల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ ఉన్నాడు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

భువనగిరి టౌన్, జూలై 12: భువనగిరి పట్టణ శివారులోని డాల్ఫిన్ హోటల్ సమీపంలోని శబరి నగర్‌లో రూ.3వేల విలువైన గుట్కాలను శుక్రవారం ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి విక్రయానికి సిద్దంగా ఉంచిన గుట్కాలను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

వరుణా..కరుణించవా..



బొడ్రాయివద్ద మొక్కు చెల్లించుకుంటున్న మహిళలు

వలిగొండ, జూలై 12: సకాలంలో వర్షాలు కురవాలని మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామ మహిళలు బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు. అదునుదాటుతున్నా..వర్షాలు పడకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని వేడుకున్నారు. మహిళలు బాలమణి, కళమ్మ, సరిత, అంజమ్మ, శంకరమ్మ, అనిత, అలివేలు, వినోద, లక్ష్మమ్మ, రేణుక, లతశ్రీ పాల్గొన్నారు.

ఆరెగూడెంలో చుట్టు కాముడు



ఆరెగూడెంలో చుట్టుకాముడు ఆడుతున్న మహిళలు

మోత్కూరు: వర్షాలు కురియాలని మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో బిందెల్లో నీళ్ల తెచ్చి వాటిని అలంకరించారు. వాటి చుట్టూ చుట్టుకాముడు ఆడారు.

కార్యదర్శి లేరు.. ప్రత్యేక అధికారి రారు

- 20రోజులుగా తెరుచుకోని పంచాయతీ కార్యాలయం
- పాలడుగులో కుంటుపడిన పాలన



తాళం తీయని పాలడుగు గ్రామపంచాయతీ కార్యాలయం

మోత్కూరు, జూలై 12: మండలంలోని పాలడుగు గ్రామంలో పంచాయతీ పాలన కుంటుపడింది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ఇప్పుడు గ్రామపంచాయతీలకు సర్పంచులు లేరు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. పాలడుగు గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.శోభన్ గత నెల 22నుంచి దీర్ఘకాలిక (మూడు మాసాలు) సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో కనీసం ఇన్‌చార్జి కార్యదర్శిని కూడా నియమించలేదు. డిప్యూటీ తహసీల్దార్ గ్రామ ప్రత్యేక అధికారిగా ఉన్నారు. ఇటు పంచాయతీ కార్యదర్శి లేక, అటు గ్రామ ప్రత్యేక అధికారి రాక గ్రామ సచివాలయం తాళం తీయడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పర్యవేక్షణ కొరవడి సిబ్బంది కూడా సక్రమంగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం కావడంతో వీధుల్లో చెత్తాచెదారం పేరుకపోయి, మురికి కాల్వలు సకాలంలో శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లక పోవడంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయడంలేదంటున్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగక రాత్రి వేళ చీకట్లో ప్రజలు వీధుల్లో నడిచేప్పుడు ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక, విషపురుగులేమైనా సంచరిస్తున్నాయో తెలియక భయంభయంగా వెళ్లాల్సి వస్తోందంటున్నారు. కార్యదర్శి, ప్రత్యేక అధికారి లేక కార్యాలయం తెరువకపోవడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నూతన ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంతో ఇబ్బంది పడుతున్నామంటున్నారు. వివిధ పనులపై గ్రామపంచాయతీకి వచ్చిన ప్రజలకు కార్యాలయం తాళం తీయక పోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలి



పాలడుగు గ్రామపంచాయతీ కార్యదర్శి శోభన్ సెలవుపై వెళ్లడం, గ్రామ పత్యేక అధికారి గ్రామానికి రాకపోవడంతో సుమారు 20రోజులుగా పంచాయతీ కార్యాలయం తాళమే తీయడం లేదు. గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ సమస్యగా మారింది. తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయానికి వచ్చే వారికి కార్యాలయం తాళం వేసి ఉండటంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వెంటనే మా గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని నియమించి సమస్యలు పరిష్కరించాలి.

-గుండు వెంకటనర్సు, స్థానికుడు

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, జూలై 12: ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యాదర్శి గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసుకోవడానికి గ్రామాల్లో కమిటీలను వేసి పటిష్టం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, పేరబోయిన పెంటయ్య, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, నాయకులు గోపగాని రాజు, ఆరె పుష్ప, నర్సమ్మ, బంగారి, బండపల్లి నర్సయ్య, మాటూరి మల్లయ్య, నరేష్, రాజు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతి కర్రల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, జూలై 12: మండల పరిధిలోని మెహర్‌నగర్, జలాల్‌పూర్ గ్రామాల్లోని ఏటీసీసీ, సీఎస్ఆర్ హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో వృద్ధుల సమాఖ్య 24 మంది సభ్యులకు శుక్రవారం చేతి కర్రలు, ట్రైపాడ్స్, ఎల్బో కచర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ షాద్రాక్, డైరెక్టర్ యతేంద్ర యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి శివస్వాముల ఆర్థిక సాయం

భువనగిరి రూరల్, జూలై 12: భువనగిరి మండలం గౌస్ నగర్‌కు చెందిన రాచర్ల శంకరప్ప (30) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన శివ స్వాముల బృందం తరపున శుక్రవారం బాధిత కుటుంబానికి రూ. 10వేల నగదు ఆర్థిక సాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో నల్లమాసు బాలరాజు గౌడ్, బూషబోయిన నర్సింహ, పాక జహంగీర్ ఉన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా వెంకటేష్

యాదగిరిగుట్ట రూరల్, జూలై 12: యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం పద్మశాలి సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా ఎర్ర గుంట్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా దీకొండ వెంకటేష్, కోశాధికారిగా మెరుగు మధుసూదర్ ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మోత్కూరు, జూలై 12: మండలంలోని పాటిమట్ల ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మిర్యాల దామోదర్, మన్నె అగ్గిరాములు, టి.ఉప్పలయ్య, ఎ.రామానుజమ్మ, సిహెచ్.స్వప్న, కె.నాగలక్ష్మీ, వీరాచారి పాల్గొన్నారు.

నోముల రాంరెడ్డి ఆశయసాధనకు కృషి

వలిగొండ, జూలై 12: సీపీఎం నాయకుడు నోముల రాంరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సంగెం గ్రామంలో కామ్రేడ్ నోముల రాంరెడ్డి 18వ వర్ధంతిని నిర్వహించారు. ఆయనకు ఘన నివాళులర్పించారు.

కళాకారులకు డప్పుల పంపిణీ

గుండాల, జూలై 12: మండలంలోని వస్తాకొండూరు గ్రామానికి చెందిన కళాకారులకు శ్యామల శ్రీశైలం 20మందికి డప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, నాయకులు లింగాల అనిల్, ఇంద్రపాల్, రామచంద్రం, రాములు, దర్గయ్య, పాష, సుధాకర్ ఉన్నారు.

ఏజీపీగా హరిబాబు

ఆలేరు రూరల్, జూలై 12: ఆలేరు మండలం గొలనుకొండ గ్రామానికి చెందిన భీమగాని హరిబాబు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. జిల్లాలో నలుగురు ప్లీడర్లను లా ఆఫీసర్లుగా విధులు నిర్వహించాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ఆ నలుగురిలో భీమగాని హరిబాబు ఒకరు.

ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.3.7లక్షలు

భువనగిరి టౌన్, జూలై 12: భువనగిరి పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.3,07,315 ఆదాయం లభించింది. 113 రోజులుగా భక్తులు ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



సుంకిశాలలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, జూలై 12: మండలంలోని సుంకిశాల పరిధిలోని మెగా గ్యాస్ కంపెనీ నుంచి బీటీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం సుంకిశాల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాటలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా గ్యాస్ నుంచి సుంకిశాల వరకు సుమారు 2 కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. రోడ్డుపైన గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొండె కిష్టయ్య, నాయకులు బాలయ్య, జంగయ్య, సత్తిరెడ్డి, సత్తయ్య, స్వామి, బొందయ్య, రాములు, ఎల్లయ్య, మల్లేశం పాల్గొన్నారు.

కాశవాడలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కాశవాడలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, నాయకుడు పైళ్ల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా వారు శుక్రవారం కాశవాడను సందర్శించి కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశవాడ, రహదారి బంగ్లా ఏరియాలో సుమారు 500 కుటుంబాలు ఉంటాయని, వారంతా రైతులు, కూలీలన్నారు. పలు కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని, ఉన్న రేషన్ కార్డుల్లోనూ పిల్లల పేర్లు నమోదు కాక వారు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు రాచకొండ రాములమ్మ, కూరపాటి రాములు, గుండు లక్ష్మీ, ఎండి.గోరేమియా, లాల్బీ, మదార్, ఇమామ్ పాల్గొన్నారు. సీపీఎం నాయకులు వచ్చిన సమయంలో స్థానిక గాంధీనగర్‌లో జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించడానికి వెళ్లామని ఏఎన్ఎం సైదమ్మ తెలిపారు.

ఎన్నికల విధానంపై 'బ్రిలియంట్'లో అవగాహన



ఎన్నికల విధానంపై అవగాహనలో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి టౌన్, జూలై 12: జిల్లా కేంద్రం భువనగిరిలోని బ్రిలియంట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్ బాయి, హెడ్ గర్ల్ తదితర పోస్టులకు బ్యాలెట్ విధానంలో నిర్వహించిన ఎన్నికలలో విద్యార్థులు ఉత్సాహంగా ఓట్లు వేశారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే నామినేషన్లు, ప్రచారం, తరగతుల వారిగా సమావేశాలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ప్రమాణ స్వీకారం, విద్యార్థులతో కూడిన ఎన్నికల సిబ్బంది పర్యవేక్షణ తదితర కార్యకలాపాలు నిర్వహించారు. దీంతో పాఠశాలలో రెండు రోజుల పాటు ఎన్నికల సందడి నెలకొంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటేందుకు విద్యార్థి క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నక్క కృష్ణ తెలిపారు.

ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయాలి

భువనగిరి టౌన్, జూలై 12: జిల్లా కేంద్రం భువనగిరిలో ఆటోస్టాండ్లను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ట్రాఫిక్‌తో భువనగిరిలో ఆటోలను నిలిపేందుకు సరైన స్థలాలు లేక డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సామల శోభన్‌బాబు, వెంకటేశ్, గొర్ల లక్ష్మణ్, ఎండి.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రంగు ఎంతో ప్రాధాన్యమైనది



ట్రీనిటీ విద్యాసంస్థలో పసుపు రంగు దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చౌటుప్పల్ టౌన్, జూలై 12: సమాజంలో పసుపు రంగు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని చౌటుప్పల్‌లోని ట్రీనిటీ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వి.మంజుల అన్నారు. స్థానిక ట్రీనిటీ విద్యాసంస్థలో శుక్రవారం పసుపు రంగు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యాసంస్థలో పసుపు రంగు వస్తువులతో అలంకరించారు. పసుపుతో పాటు పసుపు రంగు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారావు , కో-ఆర్డినేటర్స్ మాలిక్, నీరజ, స్వప్న, శివరాణి, అనూష, లక్ష్మీప్రియ, జ్యోతి, సింధు, ఉమామహేశ్వరి, హారిక, శిరీష పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రై డే చేపట్టాలి



బొల్లేపల్లిలో గ్రామస్థులకు డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

భువనగిరి రూరల్, జూలై 12: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సంపులు, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకున్నట్లయితే దోమలను నివారించుకోవచ్చునని ఎంపీడీవో చిలుకూరి శ్రీనివాస్ అన్నారు. భువనగిరి మండలం బొల్లేపల్లిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత మురుగునీరు, నాచుపట్టిన నీరును తొలగించుకున్నట్లయితే దోమల నివారణకు దోహదపడుతాయని, దీంతో డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా తదితర వ్యాధులు దరి చేరవన్నారు. ఎంపీవో అనురాధ దేవి, మండల వైద్యాధికారి డాక్టర్ యామిని, పంచాయతీ కార్యదర్శి లోకేశ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా..

భువనగిరి రూరల్, జూలై12: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చందుపట్లకు చెందిన మహిళ రైతు చెంచారపు నర్సమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 30వేల నగదు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బల్గూరి మధుసూదన్ రెడ్డి, సుబ్బూరు మహేందర్, బ్యాంకు సీఈవో నర్సింహ ఉన్నారు.